

# పేలని పటాకు..

- ఆశించిన ఫలితం ఇవ్వని రణభేరి సభ
- తేలిపోయిన రేవంతం తొలి కార్యక్రమం
- తీవ్ర నిరాశలో రేవంత్ రెడ్డి, షబ్బీర్ అలీ
- పట్టించుకోని కామారెడ్డి జనం



నిజామాబాద్, నవంబర్ 11
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)
అసెంబ్లీ ఎన్నికలకు ముందే కాంగ్రెస్ పార్టీకి ప్రతికూల ఫలితాలు కనిపిస్తున్నాయి. నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఖరారు కోసం నానా తంటాలు పడిన హస్తం పార్టీకి ప్రస్తుతం క్యాడర్‌ను నడిపించే నాథుడే కరువయ్యారు. కామారెడ్డి నియోజకవర్గంలో సీఎం కేసీఆర్‌కు పోటీగా దిగిన పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి నిర్వహించిన తొలి సభ తుస్సుమనడంతో క్యాడర్‌లో తీవ్ర నిరాశ అలుముకున్నది. రణభేరి సభను ముగించుకొని హైదరాబాద్‌కు రేవంత్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి షబ్బీర్ అలీ వెళ్లి పోవడంతో కాంగ్రెస్‌ను ముందుకు తీసుకెళ్లే వారే కరువయ్యారు. మొన్నటి వరకు కేసీఆర్‌పై పోటీచేస్తానని చెప్పిన షబ్బీర్ అలీ ఏకంగా తోకముడిచి పారిపోవడంపై జనాల్లో పెద్ద ఎత్తున చర్చ నడుస్తున్నది. ఈ పరిస్థితుల్లో కేసీఆర్‌ను ఎదుర్కోవడం కష్టమైన పనిగా హస్తం పార్టీ గ్రహించింది. కనీసం రేవంత్ రెడ్డి నిర్వహించిన తొలి కార్యక్రమం విజయవంతం కాకపోవడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా పక్క పార్టీ వైపు చూస్తున్నట్లుగా తెలిసింది. కేసీఆర్‌పై పోటీచేయడం కన్నా గులాబీ కండువా కప్పుకోవడం గౌరవప్రదంగా ఉంటుందన్న చర్చ జోరుగా నడుస్తున్నది.

### పోలిక ఎక్కడ?

కేసీఆర్‌ను ఎదుర్కొనేందుకు భారీ ప్రకటనలు చేసిన వ్యక్తులంతా రణరంగంలో పోరాటం చేసేటప్పటికీ మాటలన్నీ చిత్తవుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీతో కనీసం పోలిక లేదన్నట్లుగా పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ పార్టీతో బీఆర్ఎస్‌కు పోటీ అన్నదే లేదన్న విధంగా శుక్రవారం నాటి సభ తేటతెల్లం చేసింది. పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి కామారెడ్డి ప్రాంతానికి ఏ రకమైన సంబంధం లేదు. తెలంగాణ ఉద్యమంలోనూ ఈ ప్రాంతంతో కనీసం అనుబంధం కూడా రేవంత్ రెడ్డి అనుభవంలో లేకపోవడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉద్యమ గడ్డపై ప్రచారం చేసేందుకు ఇబ్బందిపడుతున్నారు. తెలంగాణ కోసం సాగిన పోరాట సమయంలో రేవంత్ రెడ్డి టీడీపీలో ఉంటూ సమైక్య పాలకుల కనుసన్నల్లో ఉద్యమాన్ని కించపరిచే పనులకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. స్వరాష్ట్ర సాకారం కోసం జరిగిన పోరాటంలో పెను ఉద్యమాలకు వేదికగా నిలిచిన కామారెడ్డిలో నాటి ఉద్యమకారుల నుంచి కాంగ్రెస్ పార్టీకి సపోర్ట్ శూన్యంగా మిగులుతున్నది. ఉద్యమాన్ని ముందుండి నడిపిన బీఆర్ఎస్ పార్టీతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డితో పోలికే లేదన్న వాదనలు సైతం బలంగా వినిపిస్తున్నాయి.

### పరేషాన్...

కేసీఆర్‌పై పోటీ చేస్తామంటూ తొడగొట్టి సవాల్ విసిరిన షబ్బీర్ అలీ అనూహ్యంగా నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి మారడంతో శ్రేణుల్లో అనుమానాలు పెరిగాయి. బీఆర్ఎస్ అధినేతతో ఢీ కొడతానంటూ చెప్పిన వ్యక్తి సడెన్‌గా మాట మార్చడం, చెప్పా పెట్టకుండా క్యాడర్‌ను రోడ్డున పడేసి పీసీసీ చీఫ్ వెంట తిరగాలంటూ హుకుం జారీ చేయడంపై సొంత పార్టీ నేతలే విమర్శిస్తున్నారు. షబ్బీర్ నిర్ణయం మార్పు వెనుక జరిగిన తతంగం ఏమిటోనంటూ కాంగ్రెస్ పార్టీలో జోరుగా చర్చ నడుస్తున్నది. నిజామాబాద్ అర్బన్‌లో కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలకు పాల్పడినట్లే కామారెడ్డిలోనూ దుష్ట రాజకీయానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తుందంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గెలుపు ఖాయమై మెజార్టీ కోసం తాపత్రయపడుతున్న గులాబీ పార్టీ రోజు రోజుకూ ప్రచారంలో దూసుకుపోతుంటే షబ్బీర్ అలీ కచ్చితమైన సమయంలో చేతులెత్తేయడం తగదన్నట్లుగా క్యాడర్ చెబుతున్నది. షబ్బీర్ అలీ అకస్మాత్తుగా నియోజకవర్గ మార్పుతోపాటు బీసీ డిక్లరేషన్ సభ అట్టర్ ఫ్లాప్ కావడంతో కోలుకోలేని విధంగా హస్తం క్యాడర్ పరేషాన్‌లో పడింది. పీసీసీ చీఫ్ స్వయంగా వచ్చి కామారెడ్డిలో పోటీచేస్తున్నారని జబ్బలు చర్చుకున్న నేతలకు కాంగ్రెస్ సభ జరిగిన తీరుతో వాస్తవాలు అవగతమైనట్లుగా తెలుస్తున్నది.

### జనాల్లో చర్చే లేదు..

డిక్లరేషన్ల పేరిట తెలంగాణ అంతటా సభలను నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ పరువు పోగొట్టుకుంటున్నది. ఆశించిన స్థాయిలో స్పందన ఎక్కడ కూడా రాకపోవడంతో తీవ్ర నిరాశ, నిస్పృహలో క్యాడర్ కొట్టుమిట్టాడుతున్నది. అగ్రనాయకత్వాన్ని పట్టుకొచ్చి ప్రచారం చేయిస్తున్నప్పటికీ ఫలితం మాత్రం లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీ ఏమీ చేయలేని దుస్థితిలోకి వెళ్లిపోతున్నది. బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్న ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ప్రాబల్యమే లేదు. 2014, 2018 ఎన్నికల్లో విజయదుందుబి మోగించిన భారత రాష్ట్ర సమితి తిరుగులేని శక్తిగా కొనసాగుతున్నది. 2023 అసెంబ్లీ పోరులోనూ గత ఫలితాలే రిపీట్ అవుతాయని రాజకీయ విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో భారీ ఆశలతో బరిలోకి దిగిన కాంగ్రెస్ పార్టీకి ఆశించిన స్థాయిలో ప్రజల నుంచి స్పందన రావడం లేదు. అందుకు శుక్రవారం కాంగ్రెస్ రణభేరి సభనే చక్కని ఉదాహరణగా నిలుస్తున్నది. కర్ణాటక సీఎం సిద్ధరామయ్యతోపాటు పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, ఇతర సీనియర్ నాయకులను ఎవ్వరూ ఇక్కడి జనాలు పట్టించుకోలేదు. మొన్నటి వరకు కామారెడ్డిలోనే ఉంటూ వివిధ కార్యక్రమాలు చేసిన షబ్బీర్ అలీని కూడా ప్రజలు కనీసం పరిగణలోకి తీసుకోలేదంటే అతిశయోక్తి కాదు.



# రోగుల పాలిట దైవం.. కేసీఆర్



- ప్రజల చెంతకు మెరుగైన వైద్యం
- తెలంగాణలో మారిన ప్రజల జీవన శైలి
- రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యరంగ అభివృద్ధి
- బీఆర్ఎస్‌ను కాపాడుకోవడం ప్రజల బాధ్యత
- అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి
- 'నమస్తే తెలంగాణ'తో హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్మన్ డాక్టర్ బద్దం మధుశేఖర్

## INTERVIEW

ఆర్మూర్, నవంబర్ 11: తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రజల జీవన విధానం, మౌలిక వసతులు, స్థితిగతుల్లో మార్పులు చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రజల ఉన్నతి కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతగానో పాటుపడుతున్నారు. ముఖ్యంగా ఉచిత విద్యుత్, రైతుబంధు, దళితబంధు, ఆసరా పింఛన్ల వంటి సంక్షేమ పథకాలతో కేసీఆర్ ప్రజలపై ఒక మానవత్వం, కరుణ్యం నిండి ఉన్నది. పథకాలతో ప్రజల కనీస అవసరాలు తీరుతున్నాయి. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా జీవిస్తున్నారు. రోడ్లు, ఇతర వసతులు కండ్లకు కనిపిస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా వైద్యరంగం ఎంతగానో అభివృద్ధి చెందింది. బస్తీ, పల్లె దవాఖానలతో పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్యం మరింత చేరువైంది. రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న సీఎం కేసీఆర్‌ను, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కాపాడుకునే బాధ్యత ప్రజలపైనే ఉన్నదని, రాష్ట్రాన్ని ఇంతగా అభివృద్ధి చేసిన కేసీఆర్‌ను ప్రజలు వదులుకోరని కచ్చితంగా మూడోసారి కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువస్తారని ఆర్మూర్ పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్మన్ డా. బద్దం మధుశేఖర్ చెప్పారు. ' నమస్తే తెలంగాణ' తో ప్రత్యేకంగా ముచ్చటించిన ఆయన.. కేసీఆర్ ప్రభుత్వం పదేండ్లలో వైద్య, వ్యవసాయ రంగం, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలపై, బీఆర్ఎస్ మూడోసారి గెలవాల్సిన ఆవశ్యకతపై ఆయన వివరించారు.

### ఆర్మూర్ ప్రాంతం సస్యశ్యామలం..

ఆర్మూర్ ప్రాంతం ముఖ్యంగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన పథకాల్లో ఉచిత విద్యుత్ , రైతుబంధుతో వ్యవసాయానికి ఎంతగానో ఉపయుక్తంగా మారాయి. జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు కాళేశ్వరం జలాలను రివర్స్ పంపింగ్ చేసి జీవం పోశారు. ప్యాకేజీ 21 పథకం కింద భీమ్‌గల్ ప్రాంతానికి ఎస్సారెస్పీ నీటిని తీసుకురావడంతో రైతులు సంతోషంగా ఉన్నారు. గతంలో వ్యవసాయం మానేసిన వారు సైతం బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన పథకాలతో తిరిగి వ్యవసాయం చేస్తున్నారంటే సీఎం కేసీఆర్ పాలన ఏవిధంగా ఉందో చెప్పే అవసరం లేదు.

### ప్రభుత్వ దవాఖానల్లో పెరిగిన ప్రసవాల సంఖ్య

ఒకప్పుడు ప్రభుత్వ దవాఖాన అంటేనే ప్రజలు భయపడే పరిస్థితి. ప్రస్తుతం సంతోషంగా వచ్చి వైద్యం చేయించుకునే స్థాయికి ప్రభుత్వ దవాఖానలను కేసీఆర్ తీర్చిదిద్దారు. దీంట్లో ఎలాంటి సందేహం లేదు. గర్భిణులకు ఇస్తున్న నగదు ప్రోత్సాహకాలు, కేసీఆర్ కిట్, శిశువు, బాలింతలకు అవసరమైన వైద్యాన్ని అందించడం మొత్తానికి హైలెట్‌గా చెప్పవచ్చు. ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెరిగి , ప్రైవేటులో తగ్గినప్పటికీ ఓరల్‌గా ఇనిస్టిట్యూషన్ డెలివరీల సంఖ్య పెరిగింది.

### జాతీయ స్థాయిలో తెలంగాణ రికార్డు

గతంలో మతాశిశు మరణాల సంఖ్య ఎక్కువగా ఉండేది. కేసీఆర్ పాలనలో వైద్యరంగం అభివృద్ధితో ఐఎంఆర్, ఎంఎంఆర్ రేటు తగ్గింది. ఈ సంఖ్య జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం ఆశించిన స్థాయి కన్నా తెలంగాణలో చాలా పెద్ద మొత్తంలో తగ్గింది. 2019 లెక్కల ప్రకారం జాతీయ స్థాయిలో వెయ్యి మంది శిశువుల్లో 23 మంది చనిపోతున్నారని రికార్డు ఉన్నది. రాష్ట్ర ఏర్పాటుకు ముందు తెలంగాణలో ఈ సంఖ్య 30గా ఉండగా, ప్రస్తుతం 20 మరణాలు నమోదు అవుతున్నాయి. ఇది జాతీయ స్థాయి కన్నా తక్కువే కావడం గమనార్హం. దీనికి కారణం ప్రభుత్వ దవాఖానల్లో వసతులు పెరగడమే.

### కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం..

గత ప్రభుత్వాల కన్నా కేసీఆర్ పాలన ఎంతో బాగున్నది. ఇటు వైద్యపరంగా మరోవైపు సంక్షేమం, రైతులకు అండతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఎంతగానో చేరువైంది. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం వస్తే ఆరోగ్యపరంగా మరింత అభివృద్ధి పరచడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ఇందులో భాగంగానే నా 30ఏండ్ల అనుభవం చూసిన కేసీఆర్ తనను రాష్ట్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్మన్‌గా నియమించారు.

### ప్రజలకు చేరువైన వైద్యం..

సగటు మనిషికి అవసరమైనది వైద్యం. ప్రాథమిక , సబ్‌సెంటర్ల సంఖ్యను పెంచుతూ వైద్యాన్ని విస్తరించారు. దేశంలో ప్రధాన సమస్య రక్తహీనత, పౌష్టికాహార లోపం. దీనిని సైతం అధిగమించేందుకు అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, శిశువులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నది. దీంతో రక్తహీనత, పౌష్టికాహార లోప నివారణలో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో నిలిచేందుకు కేసీఆర్ ఎంతో కృషి చేశారు. హైదరాబాద్, వరంగల్ వంటి మహానగరల్లో బస్తీ దవాఖానలు, గ్రామాల్లో పల్లె దవాఖానలు, నియోజకవర్గ స్థాయిలో 30పడకల దవాఖాన నుంచి వంద పడకల దవాఖానగా అప్‌గ్రేడ్ చేసి ఆక్సిజన్ బెడ్‌లు ఏర్పాటుచేశారు. జిల్లాకో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయడంతో వైద్య విద్య అభ్యసించడానికి పేద , మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు అవకాశం కలిగింది. ఇందులో సీఎం కేసీఆర్ కృషి ఎంతో ఉన్నది. కరోనా సమయంలో సైతం దవాఖానల్లో అన్ని సదుపాయాలు కల్పించారు. ఆరోగ్యపరంగా స్పష్టంగా ఏది తెలుపు, ఏది నలుపు అనే విషయం ప్రజలకు కనిపిస్తున్నది.



# ఆనంద రవళి.. దీపావళి



- జిల్లాలో సందడిగా మారిన మార్కెట్లు
- జోరందుకున్న పటాకుల విక్రయాలు
- బంతిపూలు, పేనీలకు భలే గిరాకీ
- నేడు దీపావళి

నిజామాబాద్ కల్చరల్/ కామారెడ్డి, నవంబర్ 11: ఉమ్మడి జిల్లా ప్రజలు దీపావళిని ఘనంగా జరుపుకోవడానికి సిద్ధమయ్యారు. ఆదివారం ధన లక్ష్మీ దేవి పూజలను నిర్వహించేందుకు వాణిజ్య సంస్థలు, దుకాణాదారులు, ప్రజలు ఏర్పాట్లు చేసుకున్నారు. పటాకులు, నోరూరించే మిఠాయిలు, పేనీల అమ్మకాలు జోరందుకున్నాయి. దుకాణాలను విద్యుత్ కాంతులతో వెలిగిపోయేలా ముస్తాబుచేశారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని పండుగకు అవసరమైన వస్తువుల అమ్మకాలు కొనుగోళ్లతో మార్కెట్ సందడిగా మారింది. పూలు, పూజాసామగ్రి, ఖాతా పుస్తకాలు భారీగా విక్రయిస్తున్నారు. అందరూ అమితానందంగా ఇష్టపడే పేనీలకు డిమాండ్ పెరిగింది.

### దీపం జ్యోతి నమోస్తుతే..

స్వాతి నక్షత్రంతో కూడిన అమావాస్య నాడు దీపావళి పండుగను జరుపుకోవడం సంప్రదాయం. దీపావళి అంటే దీపాల వరుస. పద్మ, స్కంద పురాణాల్లో దీపావళి గురించిన ప్రస్తావన ఉన్నది. శ్రీమహావిష్ణువు వామనావతారంలో బలి చక్రవర్తిని పాతాళలోకానికి అణగదొక్కి సుతల రాజ్యాధిపతిని చేసినందుకుగాను ఈ అమావాస్యను దీపావళిగా జరుపుకొంటారని, శ్రీరామచంద్రుడు రావణాసురున్ని వధించి శ్రీసీతా లక్ష్మణ ఆంజనేయాధులతో అయోధ్యకు వచ్చి పట్టాభిషేక్తుడైన రోజుగాను దీపావళి జరుపుకొంటారు. శ్రీ కృష్ణుడు సత్యభామ సమేతుడై నరకాసురుడిని వధించిన సందర్భంగా ప్రజలు దీపావళిని జరుపుకొంటున్నారని కృతా, త్రేతా, ద్వాపర యుగాలకు సంబంధించిన కథలు ప్రచారంలో ఉన్నాయి. పంచపాండవులు వనవాస, అజ్ఞాత వాసాలు పూర్తిచేసుకొని విజయవంతులై తిరిగి వచ్చినందుకు ఆనందంతో దీపావళి జరుపుకొంటున్నారని కూడా ప్రచారంలో ఉన్నది. ఆది పరాశక్తి శుంభనిశుంభని రాక్షసులని సంహరించినందుకు ఆనందంతో వెలిగించిన జ్యోతులే దీపావళి అని పెద్దలు చెబుతారు. ఇవే కాక క్షీరసాగర మథనంలో అవతరించిన శ్రీమహాలక్ష్మీదేవి ఉద్భవించిన దినంగా ప్రజలు దీపావళి పండుగను జరుపుకొంటారు. దీపాలు వెలిగిస్తే సకల దోషాలు తొలిగి వైకుంఠ ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం.

### నరక చతుర్దశి, హారతులు

నరక చతుర్దశి సందర్భంగా ఉదయం మంగళ హారతులు తీసుకోవడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. ఇంట్లో ఉన్న కుటుంబసభ్యులకు ఆడపడుచులు మంగళహారతులు ఇచ్చి వీరతిలకం దిద్దడం ఆనవాయితీ. ఇదే రోజున నువ్వుల నూనెతో స్నానం ఆచరిస్తే సకల దోషాలు తొలుగుతాయని, నూనెలో లక్ష్మీదేవి, నీటిలో గంగామాత ఉంటారని పెద్దలు చెబుతారు. దీపావళి రోజున పితృదేవతలు సాయం సంధ్యా సమయాన ఆకాశంలో దక్షిణ దిక్కుగా వచ్చి తమ సంతానాల గృహాలను సందర్శిస్తారట, వారికి దారి కనిపించడం కోసమే దివ్వెలు పెట్టే సంప్రదాయం ఏర్పడింది. చిచ్చుబుడ్లు, మతాబులు, కాకరకడ్డీలు, రాకెట్లు తదితర పటాకులను ఈ సందర్భంగా కాలుస్తారు. వ్యాపారులు ధనలక్ష్మీదేవిని అవాహనం చేసి ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తారు.



పటాకులు కొనుగోలు చేస్తున్న పిల్లలు





కామారెడ్డిలో బంతిపూల వద్ద కొనుగోలుదారులు



### సందడే సందడి..

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కుమార్‌గల్లీ, రాష్ట్రపతిరోడ్, నెహ్రూ పార్కు, హైదరాబాద్‌రోడ్, ఎల్లమ్మగుట్ట, వినాయక్‌నగర్, వర్నిచౌరస్తా, సుభాష్‌నగర్, దుబ్బ, కంఠేశ్వర్ తదితర ప్రాంతాల్లో దీపావళి పూజకు అవసరమయ్యే సామగ్రి క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అరటి, మామిడికొమ్మలు, లక్ష్మీదేవి ప్రతిమలు, ప్రమిదలు, వరిపేలాలు తదితర అమ్మకాలు నిర్వహిస్తున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంతోపాటు బాన్సువాడ,ఎల్లారెడ్డి,జుక్కల్ నియోజక వర్గాలలో దీపావళి సందడి నెలకొన్నది. మార్కెట్‌లో రకరకాల ప్రమిదలు,బంతి పూలు, గుమ్మడి కాయలు, పటాకులు సిద్ధంగా ఉన్నాయి. మిఠాయి దుకాణాలు, జనరల్ స్టోర్స్ ప్రజలతో కిటకిటలాడాయి. జిల్లా కేంద్రంలో జేపీఎన్ రోడ్, సుభాష్‌రోడ్, తిలక్ రోడ్, సిరిసిల్లా రోడ్, స్టేషన్ రోడ్‌తోపాటు పలు ప్రాంతాలు కొనుగోలుదారులతో సందడిగా మారాయి.



నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద కొనుగోలుదారులతో సందడి వాతావరణం